గోదావరిలో ఇసుక దొంగలు!

- అక్రమంగా తరలిపోతున్నా అడ్డుకోని వైనం
- అక్రమ దందా వెనక అధికార పార్టీ నాయకులు?
- పట్టించుకోని అధికారులు


ద్వారక గోదావరి తీరంలో ట్రాక్టర్లలో ఇసుక నింపుతూ..

దండేపల్లి: అవకాశాన్ని ఆసరాగా చేసుకుని, అక్రమంగా ఇసుక రవాణా చేస్తూ వేలాది రూపాయలు సంపాదిస్తున్నారు ఇసుకాసురులు. దండేపల్లి మండలం ద్వారక గోదావరి నదీ తీరం నుంచి నిత్యం ఇసుక అక్రమరవాణా జోరుగా సాగుతోంది. అధికారులు దాడులు నిర్వహించినా ఏమాత్రం బెదరడంలేదు. అధికారులు వచ్చి దాడులు నిర్వహించే సమయంలో చిక్కకుండా తప్పించుకుంటున్నారు. అక్రమ ఇసుక దందా వెనుక అధికార పార్టీ నాయకులు ఉన్నట్టుగా సమాచారం. అధికారులు దాడులు నిర్వహించి, ట్రాక్టర్లు పట్టుకున్నా ఏమాత్రం బెదరడం లేదు. అక్రమ ఇసుకదందాను యథేచ్ఛగా సాగిస్తున్నారు.

తెప్పలతో తెచ్చి.. ట్రాక్టర్ల ద్వారా తరలించి..

వేసవి సమీపిస్తున్నా నదిలో నీళ్లు నిలిచి ఉండటంతో, నీళ్ల లోంచి ఇసుకను తోడి ఒడ్డుకు తెచ్చేందుకు ఇసుకాసురులు తర్మాకోల్ తెప్పలు వినియోగిస్తున్నారు. ఒక్కో తెప్పపై ఒక ట్రాక్టర్ లోడ్ ఇసుకను తోడి, ఒడ్డుకు తెచ్చి ట్రాక్టర్లలో నింపి, తరలించాల్సిన చోటికి తరలిస్తున్నారు. ద్వారక గోదావరి తీరంలో సుమారు 08కి పైగా తర్మాకోల్ తెప్పలు నడవడంతో, పదికి పైగా ట్రాక్టర్లు నిత్యం ఇసుకను అక్రమంగా తరలించడంతో, ఇసుకాసురుల వ్యాపారం మూడు పూవులు.. ఆరుకాయలుగా సాగుతోంది.

నదిలోనే దర్జాగా ఇసుక జల్లింపు..

ఇసుకలో దొడ్డు ఇసుకకు ఒక ట్రాక్టర్ ట్రిప్‌కు రూ.3వేలు, సన్నరకం ఇసుకకు (జల్లెడ పట్టిందానికి) ఒక ట్రాక్టర్ ట్రిప్‌కు రూ.6,500ధర ఉండటంతో ఇసుకాసురులు దర్జాగా, నదిలోనే ఇసుకను జల్లెడ పట్టి అక్కడే సన్నం, దొడ్డు, రకాలను వేరు చేసి, సన్నరకం కావాలన్న వారికి సన్న ఇసుక, దొడ్డురకం కావాలన్న వారికి దొడ్డు ఇసుక అమ్ముతూ అందిన కాడికి దండుకుంటున్నారు. ఇందంతా అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో నడవడంతో పాటు, దందాను నడిపించేదే వారు కావడంతో, ఈ అక్రమ దందా వ్యవహారం అధికారులకు తెలిసినా తమకేమి పట్టనట్టుగా వ్యవహరించడంతో, ఇసుక అక్రమ దందాకు అడ్డూ అదుపులేకుండా పోయింది. ఉన్నతాధికారులు స్పందించి అక్రమఇసుక రవాణాను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

> **కేసు నమోదు చేస్తాం..**
>
> ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు ద్వారక గోదావరి తీరంలో ఇటీవలే ఆకస్మిక దాడులు నిర్వహించాం. రెండు ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేశాం. అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే, ఎవరైనా సరే చట్టపరమైన చర్యలు తీసుకుని, కేసులు నమోదు చేస్తాం.
>
> – బాలు, మైనింగ్ ఏడీ, మంచిర్యాల

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్


జన్నారం: లబ్ధిదారులతో ఎమ్మెల్యే రేఖానాయక్

జన్నారం: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని మురిమడు, చింతగూడ, జన్నారం గ్రామాలకు చెందిన 112మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేదింటి ఆడపిల్లల పెళ్లికి ఇబ్బంది కాకూడదనే ఉద్దేశంతో, సీఎం కేసీఆర్ కల్యాణ లక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిషన్, ఏఎంసీ చైర్మన్ పద్మ, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు రాజారాంరెడ్డి, వైస్‌ఎంపీపీ వినయ్‌కుమార్, కోఆప్షన్ సభ్యుడు మున్వర్ ఆలీఖాన్, ఏఎంసీ వైస్‌చైర్మన్ రాజేష్‌యాదవ్, డైరెక్టర్లు నర్సగౌడ్, భరత్‌కుమార్, ఎంపీటీసీ రియాజొద్దీన్, మాజీ ఏఎంసీ చైర్మన్ సతీష్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి జనార్దన్, నాయకులు రవి, మౌలాన, రజాక్, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ అభివృద్ధి పనులపై సమీక్ష


కమిషనర్, ఏఈతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపల్ అభివృద్ధి పనులపై శుక్రవారం ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మున్సిపల్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, ఏఈ సందీప్ ఇతర అధికారులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి పనుల నిర్వహణ గురించి ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఏఏ పనులు ఎంతవరకు పూర్తయ్యాయి, పెండింగ్ పనులు ఎప్పట్లోగా పూర్తి చేస్తారో అధికారులను అడిగి తెలుసుకున్నారు. రూ.15కోట్ల టీయూఎఫ్ఐడీసీ పనుల పురోగతి, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ఉన్న చిల్డ్రన్స్‌పార్క్ పున:నిర్మాణం, మున్సిపల్ వార్డుల్లో వచ్చే వర్షాకాలంలో తలెత్తనున్న సమస్యలను గుర్తించి సమీక్షించారు. పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేసి, పురప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, మున్సిపల్ టెక్నికల్ అధికారి అశ్రిత్, మున్సిపల్ కౌన్సిలర్లు గెల్లి రాజలింగు, గోసిక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రక్షణపై అవగాహన


సదస్సులో పాల్గొన్న కార్మికులు

రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియాలోని ఆర్కేపీ సీహెచ్‌పీలో శుక్రవారం రక్షణపై కార్మికులకు అవగాహన కల్పించారు. ప్రమాదాలు ఏ విధంగా జరిగే అవకాశముంటుంది, వాటిని ముందే పసిగట్టి ఎలా నివారించాలనే విషయాలను సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ ఇన్‌చార్జి విజయకుమార్ కార్మికులకు వివరించారు. సేఫ్ ఆపరేటింగ్ పద్ధతులను కార్మికులు అలవర్చుకోవాలని, పనిలో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌కే1ఏ గని మేనేజర్ శ్రీధర్‌రావు, డీజీఎం బాలాజీ భగవతి, పిట్ కార్యదర్శులు శంకర్రావు, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో అప్రెంటిషిప్ మేళా

మంచిర్యాలఅర్బన్: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఏప్రిల్ 3న ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో అప్రెంటిషిప్ మేళా నిర్వహిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ చందర్ తెలిపారు. ఐటీఐ ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్స్, మెకానిక్ పూర్తి చేసిన అభ్యర్థులు హాజరుకావచ్చన్నారు. పూర్తి వివరాలకు ఐటీఐలో సంప్రదించాలన్నారు.

ఉచిత కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి


ప్రారంభిస్తున్న కార్మికశాఖ అధికారి రామ్మోహన్

జన్నారం: మహిళలు ఉచిత కుట్టుశిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కార్మిక శాఖ అధికారి రామ్మోహన్‌రావు పేర్కొన్నారు. మండలంలోని మహమ్మదబాద్‌లో కార్మిక శాఖ ఆధ్వర్యంలో మహిళల కోసం ఏర్పాటు చేసిన ఉచిత కుట్టుశిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 25మంది భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలకు చెందిన మహిళలకు, 90రోజుల పాటు ఉచిత కుట్టు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడీ రఘునాథ్, సీనియర్ డాటా ఎంట్రీ అధికారి ప్రమోద్, శిక్షకురాలు మమత, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు ప్రభాకర్, మాజీ సర్పంచ్ శంకర్, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

'పేపర్ లీకేజీతో నిరుద్యోగులకు అన్యాయం'

చెన్నూర్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీతో నిరుద్యోగులకు తీరని అన్యాయం జరిగిందని వైఎస్సార్ తెలంగాణ పార్టీ చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి దుర్గం నగేశ్ అన్నారు. స్థానిక వైఎస్సార్‌టీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రశ్నపత్రాల లీకేజీతో విద్యార్థుల భవిష్యత్ అంధకారంలోకి నెట్టివేయబడిందన్నారు. ప్రభుత్వం నిరుద్యోగ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

నర్సరీలో 'వనదర్శిని'

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండల కేంద్రంలోని నర్సరీలో దొనబండ శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులకు శుక్రవారం 'వనదర్శిని' కార్యక్రమం నిర్వహించారు. లక్సెట్టిపేట అటవీరేంజ్ అధికారి(ఎఫ్ఆర్‌వో)నాగావత్ స్వామి హాజరై విద్యార్థులకు మొక్కల పెంపకం, మొక్కల పెంపకంలో తీసుకుంటున్న జాగ్రత్తలు వివరిస్తూ వాటి ప్రాముఖ్యతను వివరించారు. మొక్కలు పెంచడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలియజేస్తూ చెట్లను నరకడం వల్ల కలిగే అనర్థాలను వివరణాత్మకంగా వివరిస్తూ విద్యార్థుల్లో చైతన్యం కలిగించారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి


భీమారం: మాట్లాడుతున్న రజిత

భీమారం: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిత కోరారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా పోషణ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం హ్యాండ్‌వాష్ కార్యక్రమం నిర్వహించారు.

జైపూర్: స్థానిక ఐకేపీ కార్యాలయంలో పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా సీడీపీవో మనోరమ పౌష్టికాహారం, ఆకు కూరల ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


యోగాసనాలపై వివరిస్తున్న గురువులు

బెల్లంపల్లిరూరల్: యోగా సాధన చేయడంతో ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సీడీపీవో ఉమాదేవి, యోగా గురువులు రాయలింగు, చొక్కయ్య అన్నారు. బెల్లంపల్లి మండలంలోని గురిజాల రైతు వేదికలో శుక్రవారం ఐసీడీఎస్ బెల్లంపల్లి సెక్టార్ పరిధిలోని సూపర్‌వైజర్లకు, అంగన్‌వాడీ టీచర్లకు యోగాపై అవగాహన సదస్సు నిర్వహించగా ముఖ్య అతిథులుగా హాజరై యోగా ఆసనాలు వేసి అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు, మహిళలకు, చిన్నారులకు యోగా, చిరుధాన్యాలపై అవగాహన కల్పించాలని సూపర్‌వైజర్లకు, టీచర్లకు సూచించారు. ఈ సదస్సులో డీపీఏ శ్యామల, సుజాత, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

దుబ్బగూడెంలో పోలీస్ 'కమ్యూనిటీ కాంటాక్ట్'


అవగాహన కల్పిస్తున్న సీఐ జగదీష్

కాసిపేట: మండలంలోని కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధి దుబ్బగూడెంలో శుక్రవారం సాయంత్రం పోలీసుల ఆధ్వర్యంలో 'కమ్యూనిటీ కాంటాక్ట్' ప్రోగ్రాం నిర్వహించి ఇళ్లను సోదా చేశారు. తాండూర్ సీఐ జగదీష్ ఆధ్వర్యంలో ఎస్సైలు, పోలీసు సిబ్బంది 20మంది ఆకస్మికంగా గ్రామంలో తనిఖీలు నిర్వహించి వాహనపత్రాలు సక్రమంగా లేని 30వాహనాలు సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. నేరాల నియంత్రణకు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించడం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సైబర్ నేరాలు, ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాసిపేట ఎస్సై గంగారాం, మందమర్రి ఎస్సై మహేందర్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

డంపింగ్ యార్డు ఎత్తివేయాలి

బెల్లంపల్లి: మున్సిపాలిటీ పరిధి కొత్త బస్టాండ్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డును వెంటనే ఎత్తివేయాలని మున్సిపల్ రెండో వార్డు కౌన్సిలర్ అఫ్సర్ కోరారు. మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. రెండో వార్డు పరిధిలో ఉన్న డంపింగ్ యార్డు ఫుడ్‌ప్రాసెసింగ్ జోన్ పరిధిలోకి వెళ్లిందని తెలిపారు. అక్కడి నుంచి డంపింగ్ యార్డును మరో ప్రాంతానికి తరలించాల్సి ఉండగా, కాలయాపన చేస్తుండటంతో రోడ్డుపై చెత్తచెదారం పేరుకు పోయి ఆ ప్రాంత ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని డంపింగ్ యార్డును వెంటనే అక్కడి నుంచి ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

'అందరి సహకారంతో ఉత్పత్తి సాధించాం'

జైపూర్: మండలంలోని ఇందారం ఐకే–ఓసీపీ నిర్దేశించిన 15లక్షల టన్నుల వార్షిక బొగ్గు ఉత్పత్తి సాధించడానికి అందరి సహకారం ఉందని ఇందుకు ఉద్యోగులకు అభినందనలు తెలుపుతున్నట్లుగా గని మేనేజర్ రవికుమార్ తెలిపా రు. గనిపై శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఉద్యోగులను అభినందించారు. ఐకే– ఓసీపీ పీవో శ్రీనివాస్ నేతృత్వంలో నిర్దేశించిన 15లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సా ధించడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. రాబోవు రోజుల్లో ఇదే ఒరవడిని కొనసాగిస్తూ ముందంజలో ఉండాలని కోరారు. కార్యక్రమంలో రక్షణాధికారి సతీశ్, సంక్షేమాధికారి గౌస్‌పాషా, ఫిట్‌కార్యదర్శి రత్నాకర్‌రెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.

సమాచారం

సైబజార్ వేలం వాయిదా

చెన్నూర్: మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం జరగాల్సిన సైబజార్, వారాంతపు సంతకు సంబంధించిన బహిరంగ వేలానికి నియమ నిబంధనలకు అనుగుణంగా ఎలాంటి దరఖాస్తులు రాకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి ఎప్పుడు వేలం నిర్వహించేది తర్వాత తెలియజేస్తామని పేర్కొన్నారు.

నేడు ఆత్మీయ సమ్మేళనం

బెల్లంపల్లి: మున్సిపాలిటీలో శనివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీలోని 1, 2, 3, 4, 14, 15, 16, 17, 18, 28, 29, 30వార్డులకు చెందిన బీఆర్ఎస్ శ్రేణులు ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే చిన్నయ్య ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల శ్రేణులు ఆత్మీయ సమ్మేళనానికి హాజరుకావాలని ఆమె కోరారు.

నేడు మండల సమావేశం

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఉదయం 11గంటలకు నిర్వహించే సమావేశానికి సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని సూచించారు. అధికారులు గడిచిన మూడు నెలల ప్రగతి నివేదికలతో రావాలన్నారు.

ఇన్‌చార్జి ఎంఈవోగా ప్రభాకర్

కాసిపేట: మండల ఇన్‌చార్జి ఎంఈవోగా తాండూర్ ఎంఈవో ప్రభాకర్‌కు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు ఆదేశాలు జారి చేశారు. ప్రస్తుతం ఎంఈవోగా పనిచేస్తున్న దామోదర్ సెలవులో ఉండడంతో ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతాలు అప్పగించారు. వెంటనే బాధ్యతలు తీసుకోవాల్సిందిగా సూచించారు.

పౌరహక్కులపై అవగాహన


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

చెన్నూర్‌రూరల్: మండలంలోని బావురావుపేటలో శుక్రవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ మధుసూధన్‌నాయక్ హాజరై మాట్లాడారు. కుల వివక్షలకు ఎక్కడ తావివ్వొద్దని, ఇక్కడ అందరూ సమానమేనన్నారు. ఎక్కడైనా ఇలాంటివి జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌దేశ్‌పాండే, ఎస్సై సౌజన్య, సర్పంచ్ మౌనిక, ఆర్‌ఐ స్వప్న, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ఒడ్డెర కాలనీలో తహసీల్దార్ ఆధ్వర్యంలో పౌర హక్కులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సభ్యులు జిల్లపల్లి వెంకటేశం హాజరై మాట్లాడారు. సమాజంలో అందరూ సమానమే అని, ఎలాంటి వివక్షత చూపకుండా అందరితో సోదరభావంతో మెలగాలని సూచించారు. అనంతరం సీఐ రాజు మాట్లాడుతూ పౌర హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ తిరుపతి, ఎస్సై, ఆర్‌ఐ, హెచ్‌డబ్ల్యూవోలు కుమారస్వామి, శ్రీనివాస్, సునీత, ఎంఆర్‌పీఎస్ సంఘం నాయకులు దశరథం, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

తాండూర్: మండలంలోని నర్సాపూర్‌లో సివిల్ రైట్స్‌డేను నిర్వహించారు. ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొని గ్రామస్తులకు పౌరహక్కుల ప్రాధాన్యతను, రాజ్యాంగం ప్రజలకు కల్పించిన హక్కులు, చట్టాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కవిత, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎస్సై సమ్మయ్య, ఆర్‌ఐ ఎజాజుద్దీన్, కార్యదర్శి సాదుల్లా, గ్రామస్తులు పాల్గొన్నారు.

'పౌర హక్కులకు భంగం కలిగించొద్దు'

నెన్నెల: పౌర హక్కులకు భంగం కలిగించొద్దని డెప్యూటీ తహసీల్దార్ ప్రకాష్, ఎస్సై రాజశేఖర్ అన్నారు. మండలంలోని ఖర్జి జంగాల్‌పేటలో శుక్రవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించి అవగాహన కల్పించారు.

సంక్షిప్త వార్తలు

కార్యవర్గ ప్రమాణ స్వీకారం

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం శుక్రవారం స్థానిక కోర్టు ఆవరణలో ప్రమాణ స్వీకారం చేసినట్లు ఎన్నికల కమిషనర్ గోవిందరావు తెలిపారు. వీరికి బార్ అసోసియేషన్ న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

బార్‌అసోసియేషన్ అధ్యక్షుడిగా మనోహర్

బెల్లంపల్లి: బెల్లంపల్లి బార్ అసోసియేషన్ ఎన్నికలు శుక్రవారం నిర్వహించగా అసోసియేషన్ అధ్యక్షుడిగా చిప్ప మనోహర్, ప్రధాన కార్యదర్శిగా సింగతి రాజేశ్, కోశాధికారిగా సునిల్ థామస్, స్పోర్ట్స్, కల్చరల్ సెక్రెటరీగా తొటం సౌమ్య ఎన్నికయ్యారు.

రైతుబంధు సమితి జిల్లా డైరెక్టర్‌గా భరత్‌కుమార్

జన్నారం: రైతుబంధు సమితి జిల్లా డైరెక్టర్‌గా పొన్కల్‌కు చెందిన చిట్టిమల్ల భరత్‌కుమార్‌ను నియమిస్తూ శుక్రవారం ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కష్టపడ్డ వారికి పార్టీ, తగిన స్థానం కల్పిస్తుందన్నారు. భరత్‌కుమార్ కొన్ని సంవత్సరాలుగా పార్టీ కోసం పని చేస్తున్నారని తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డుకు చెందిన జోగుల మల్లీశ్వరీకి రూ.30వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ అందించారు.

ఎస్ఎస్ఎఫ్ చెక్కు అందజేత

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఓసీపీలో గత సంవత్సరం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దానం సదానందం అనే ట్రిప్‌మెన్ కార్మికుని కుటుంబానికి కంపెనీ నుంచి మంజూరైన సోషల్ సెక్యూరిటీ ఫండ్ (ఎస్ఎస్ఎఫ్)ను అధికారులు అందించారు. గనిపై శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఓసీపీ పీఓ పురుషోత్తంరెడ్డి చేతుల మీదుగా సదానందం కుటుంబ సభ్యులకు రూ.60,100 ఎస్ఎస్ఎఫ్ చెక్కును అందించారు.

'భట్టి'ని కలిసిన భారత్ బచావో నాయకులు

పాతమంచిర్యాల: సీఎల్పీ నేత భట్టి విక్రమార్కను బెల్లంపల్లిలో కలిసి శుక్రవారం భారత్‌బచావో జిల్లా కో ఆర్డినేటర్ ఒడ్డెపల్లి మనోహర్ ఆధ్వర్యంలో నాయకులు వినతిపత్రం అందించారు.

తహసీల్దార్ ఎదుట బైండోవర్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ తహసీల్దార్ రాజలింగు ఎదుట సబ్బెపల్లి గ్రామానికి చెందిన పర్వతం వెంకటయ్యను (పాత నేరస్తుడు) హాజీపూర్ ఎస్సై ఉదయ్‌కిరణ్ శుక్రవారం బైండోవర్ చేశారు.

'షర్మిల అరెస్ట్ హేయమైన చర్య'

మంచిర్యాలక్రైం: వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిలను అక్రమంగా అరెస్ట్ చేయడం హేయమైన చర్య అంటూ వైఎస్సార్‌టీపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు సతీష్ అన్నారు. షర్మిల నిరుద్యోగుల పక్షాన టీఎస్‌పీఎస్సీ కార్యాలయం ఎదుట నిరసన చేసేందుకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకొని అరెస్ట్ చేశారన్నారు. పేపర్ లీకేజీ వ్యవహారంలో సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు.

కంటివెలుగు శిబిరాలు ప్రారంభం

దండేపల్లి: మండలంలోని పెద్దపేటలో కంటి వెలుగు శిబిరాన్ని కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యే దివాకర్‌రావు శుక్రవారం ప్రారంభించారు.

జైపూర్: మండలంలోని రామారావుపేటలో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ నామాల సత్యవతి, ఎంపీటీసీ పెద్దల బాపు ప్రారంభించారు.

బైపాస్ పనుల పరిశీలన

చెన్నూర్: విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి పెద్ద చెరువు వరకు నిర్మిస్తున్న బైపాస్ రోడ్డు పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజొద్దిన్ పరిశీలించారు.

గనులపై రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం


కార్మిక దంపతులను సన్మానిస్తున్న అధికారులు


కాసిపేట: సన్మానిస్తున్న సీతారామయ్య, నాయకులు


ఆర్కే 6 గనిలో కార్మికున్ని సన్మానిస్తున్న మేనేజర్ తిరుపతి

శ్రీరాంపూర్: ఆర్కే 6 గనిపై రిటైర్డ్ అయిన ఉద్యోగులను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. గనిపై శుక్రవారం జరిగిన కార్యక్రమంలో రిటైర్డ్ అయిన కొప్పుల చంద్రయ్య(డెప్యూటీ సూపరింటెండెంట్), చీమల ప్రకాశ్(జనరల్ మజ్దూర్)లను గని మేనేజర్ తిరుపతి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారికి కంపెనీ నుంచి వచ్చిన టర్మినల్‌బెనిఫిట్స్ పే ఆర్డర్ కాపీలను అందించారు. రిటైర్మెంట్ తరువాత శేష జీవితాన్ని సుఖ సంతోషాలతో గడుపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గని రక్షణాధి కారి కాదాసి శ్రీనివాస్, డెప్యూటీ మేనేజర్ మర్రి కొమురయ్య, ఫిట్ ఇంజనీర్ శ్యాంకుమార్, సంక్షేమ అధికారి సునిల్‌కుమార్, గుర్తింపు సంఘం ఫిట్ సెక్రెటరీ చిలుముల రాయమల్లు, నాయకులు పాల్గొన్నా రు. శ్రీరాంపూర్ ఓసీపీలో రిటైర్డ్ అయిన పి తిరుపతిరెడ్డి(ఫిట్టర్), అరకాల రాయలింగు(జనరల్ మ జ్దూర్)లను సన్మానించారు. ఏరియా ఇన్‌చార్జీ జీఎం త్యాగరాజు, ఓసీపీ ప్రాజెక్టు అధికారి పురుషోత్తంరెడ్డి వారిని శాలువాతో సత్కరించి వారు కంపెనీకి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గని మేనేజర్ సుధీర్, రక్షణాధికారి సంపత్, ఇంజనీర్ చంద్రశేఖర్, టీబీజీకేఎస్ నేతలు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సన్మానం

కాసిపేట: బెల్లంపల్లి బ్రాంచి వైస్ ప్రెసిడెంట్ బియ్యాల వెంకటస్వామి పదవీ విరమణను పురస్కరించుకొని శుక్రవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణ శంకర్, ఏఐటీయూసీ ప్రధానకార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి రేగుంట చంద్రశేఖర్, రాష్ట్ర సమితి సభ్యులు మిట్టపెల్లి వెంకటస్వామి ముఖ్యఅతిథులుగా హాజరై సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు చిప్ప నర్సయ్య, బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్, తిరుపతిగౌడ్ తదితరులున్నారు. మందమర్రి ఏరియా కాసిపేట గనిపై ఉద్యోగ విరమణ పొందిన సీనియర్ మైనింగ్ సర్దార్ బియ్యాల వెంకటస్వామి, సపోర్ట్‌మెన్ బోంగోని శంకర్‌ను శుక్రవారం అధికారులు, కార్మిక సంఘాల నాయకులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా కాసిపేట గ్రూఫ్ ఆఫ్ ఏజెంట్ కుర్మ రాజేందర్ మాట్లాడుతూ.. కంపెనీకి ఉద్యోగులు చేసిన సేవలు కొనియాడారు.

బెల్లంపల్లి: మందమర్రి ఏరియా శాంతిఖని గనిలో పని చేసి ఉద్యోగ విరమణ చేసిన కార్మికులను గని ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో సన్మానించారు. ఇందూరి మల్లయ్య (కోల్ కట్టర్), బోనగిరి రాజయ్య (జనరల్ మజ్దూర్)కార్మికులు ఉద్యోగ విరమణ చేయగా, వీరికి గని మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హా, రక్షణ అధికారి రాజు, ఫిట్ ఇంజనీర్ రాంబాబు, వెంటిలేటర్ అధికారి పూర్ణచందర్ పూలమాల వేసి సన్మానించారు. సింగరేణి కంపెనీకి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఇంజనీర్ రాంసాగర్, టీబీజీకేఎస్ ఫిట్ సెక్రెటరీ శ్రీనివాస్, కార్మికులు పాల్గొన్నారు.